RNI: APTEL/2013/54506

# నేటి ప్రస్థానం

తెలుగు దినపత్రిక




హైదరాబాద్ | బుధవారం 24-6-2026 | సంచిక: 13 | సంఖ్య: 268 | పేజీలు: 4 | వేలు: 5/- | ఎడిటర్: సందీప్ గౌడ్ వి



## ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో పాల్గొన్న మంత్రి నారా లోకేశ్

**ఉండవల్లి నివాసంలో బూత్ లెవల్ అధికారికి తన వివరాల సమర్పణ**

**ప్రతి పౌరుడూ ఓటు వివరాలు సరిచూసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి**

**ఏపీలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ**

ఆంధ్రప్రదేశ్ విద్యా, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్, ఓటర్ జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా తన ఓటు వివరాలను బూత్ స్థాయి అధికారికి (బీఎల్ఓ)

2లో

## హర్మూజ్ జలసంధిలో రికార్డు స్థాయిలో ఆయిల్ రవాణా: ట్రంప్ ప్రకటన

హర్మూజ్ జలసంధిలో ఒక్కరోజే 19 మిలియన్ బ్యారెల్ల ఆయిల్ రవాణా

ఇరాన్‌తో ఒప్పందం వల్లే ఇది సాధ్యమైందని ప్రకటించిన డొనాల్డ్ ట్రంప్

ఈ పరిణామంతో ప్రపంచవ్యాప్తంగా తగ్గుముఖం పడుతున్న చమురు ధరలు



2లో



## లోయలోకి తోసేసి..

**ప్రమాదంగా చిత్రించి కాబోయే భార్యే కడతేర్చింది!**

**పుణె వ్యాపారవేత్త మృతి కేసులో అనూహ్య ట్విస్ట్**

**ప్రియుడితో కలిసి స్కెచ్**

**మేఘాలయ హనీమూన్ మర్డర్ తరహాలో హత్య**

**అనంతరం బర్త్‌డే వేడుక**

**ఏమీ ఎరుగనట్టు ఇన్‌స్టాలో భావోద్వేగ సంతాప సందేశం**

## కొత్త సీఎస్‌గా సంజయ్ జాజు!

దాదాపు 12 ఏళ్ల తర్వాత కేంద్ర సర్వీసుల నుంచి తిరిగి రాష్ట్రానికి రాక

రాష్ట్ర కేడర్‌కు పంపాలన్న ప్రభుత్వ వినతిని ఆమోదించిన కేంద్రం

దీంతో ఆయన సీఎస్‌గా నియమితులు కానున్నట్లు పేర్కొన్న ఉన్నతస్థాయి వర్గాలు





## ఏసీబీ వలలో మరో పెద్ద చేప...

**నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరెస్ట్.. రూ.3 కోట్ల అక్రమాస్తులు గుర్తింపు**

**ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరెస్ట్**

**మల్లారెడ్డి, ఆయన బంధువుల ఇళ్లపై ఏసీబీ ఏకకాలంలో దాడులు**

**సుమారు రూ.3 కోట్ల విలువైన అక్రమాస్తులు గుర్తించిన అధికారులు**

**ఇటీవలే సర్వే శాఖ అధికారి నరహరిని అరెస్ట్ చేసిన ఏసీబీ**

**వరుస దాడులతో అవినీతి అధికారుల్లో కలవరం**

2లో

## తెలంగాణ అభివృద్ధికి ఎప్పుడూ కృషి చేస్తానన్న కేంద్ర మంత్రి

**సీఎం రేవంత్ కోసం కేంద్రమంత్రులతో సమావేశాలు ఏర్పాటు చేశా: కిషన్‌రెడ్డి**

**రేవంత్‌రెడ్డి రెండుసార్లు లేఖ రాసినట్లు వెల్లడించిన కిషన్ రెడ్డి**

**జూన్ 22న అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేసినట్లు వెల్లడి**

**ఇవాళ ఖట్టర్, అశ్విని వైష్ణవ్‌తో సంయుక్త భేటీ జరిగినట్లు తెలిపారు**

**సమావేశాలు సానుకూల వాతావరణంలో జరిగాయని వెల్లడి**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేసినట్లు కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. గత రెండు రోజులుగా ఢిల్లీలో రేవంత్‌రెడ్డి పలువురు కేంద్ర



2లో

## రేవంత్ ఏ స్కీమ్ తెచ్చినా..

**దాని వెనుక స్కాం ఉంటుంది: కేటీఆర్**

రేవంత్ కన్ను మెట్రో భూములపై పడిందన్న కేటీఆర్

సొంత మనుషులకు భూములు కట్టబెట్టేందుకే మెట్రోను స్వాధీనం చేసుకున్నారని ఆరోపణ

రేవంత్, కిషన్ రెడ్డి ఢిల్లీలో కొత్త డ్రామా మొదలుపెట్టారని ఆరోపణ

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర ఆరోపణలు చేశారు. రేవంత్ రెడ్డికి ఒక్కటే ఎజెండా ఉందని, అది మెట్రో భూముల స్కామ్ అని మండిపడ్డారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం



2లో

# ఉద్యోగులపై వరాల జల్లు..

**భారీ పెట్టుబడులకు ఆమోదం... ఏపీ క్యాబినెట్ కీలక నిర్ణయాలు**

**ఏపీ క్యాబినెట్ కీలక నిర్ణయాలు.. రూ.39,355 కోట్ల పెట్టుబడులకు ఆమోదం**

**రాష్ట్రంలో 34,610 మందికి ఉపాధి కల్పించే పరిశ్రమలకు గ్రీన్ సిగ్నల్**

**అమరావతి పనుల వేగవంతం.. మౌలిక వసతులకు టెండర్లకు ఆమోదం**

**కొందరు ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం.. పీఎస్‌యూల్లో రిటైర్మెంట్ వయసు 62కి పెంపు**

**మచిలీపట్నం, రామయ్యపట్నం పోర్టుల పరిధుల క్రమబద్ధీకరణ, పర్యాటక రంగ అభివృద్ధికి చర్యలు**



ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం, రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేసే దిశగా పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రానికి భారీ ఎత్తున పెట్టుబడులను ఆకర్షించడం, రాజధాని అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేయడం, ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం, పర్యాటక రంగం అభివృద్ధి వంటి అంశాలపై క్యాబినెట్ ప్రధానంగా దృష్టి సారించింది. సమావేశానంతరం తీసుకున్న నిర్ణయాలను మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరించారు. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతిని పరుగులు పెట్టించే లక్ష్యంతో స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డ్ (ఎస్ఐపీబీ) సిఫారసు చేసిన పలు ప్రతిపాదనలకు మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. మొత్తం రూ.39,355 కోట్ల పెట్టుబడులతో, 34,610 మందికి ప్రత్యక్షంగా ఉపాధి కల్పించే పరిశ్రమలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో భాగంగా ఏర్పాటు చేయనున్న కొన్ని ముఖ్యమైన ప్రాజెక్టులు: ప్రీమియర్ ఎనర్జీస్ (తిరుపతి): రూ.3,936 కోట్ల పెట్టుబడితో సిలికాన్ వేఫర్, మాడ్యూల్ తయారీ యూనిట్. 540 మందికి ఉపాధి.

2లో

# నాగరిక దేవో భవ!

**ప్రజల సంక్షేమమే పరమావధిగా పనిచేయండి**

**దేశ నిర్మాణానికి సమన్వయం అత్యంత కీలకం**

**యువ ఐఏఎస్‌లతో ప్రధాని మోదీ**

న్యూఢిల్లీ: అధికార విధుల్లో ఉండగా తమ వద్దకు వచ్చే ప్రతి ఫైలునూ అసంఖ్యాక పౌరుల జీవితాలకు, వారి ఆకాంక్షలకు ప్రతినిధిగా భావించాలని యువ ఐఏఎస్ అధికారులకు ప్రధాని మోదీ ఉద్బోధించారు. అలాగే, ప్రభుత్వ పాలన ఎల్లప్పుడూ సానుభూతితో స్పందిస్తూ, అందరినీ కలుపుకుపోతుండాలని ఆయన కోరారు.



2లో

# కొత్త సీఎస్‌గా సంజయ్ జాజు!

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్: రాష్ట్ర తదుపరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎవరనే అంశంపై ఉత్కంఠ నెలకొన్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. 1992 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి, ప్రస్తుతం కేంద్ర సర్వీసుల్లో ఉన్న సంజయ్ జాజు తెలంగాణకు తిరిగి రానున్నారు. ఆయనను తెలంగాణ కేడర్‌కు పంపాలన్న రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థనను కేంద్రం ఆమోదించింది. ఈ మేరకు కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పరిణామంతో సంజయ్ జాజు సీఎస్‌గా నియమితులు కానున్నారని ఉన్నతస్థాయి వర్గాలు పేర్కొంటున్నాయి, ప్రస్తుతం సీఎస్‌గా ఉన్న కె. రామకృష్ణారావు పదవీకాలం ఈ నెలాఖరుతో ముగియనుంది. సీఎస్ పదవి కోసం మొన్నటి వరకు 1992 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్‌లు అయిన ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేశ్ రంజన్ (పురపాలక శాఖ), వికాస్‌రాజ్ (ఆర్అండ్‌బీ) పోటీపడ్డారు. వారిద్దరి మధ్యనే పోటీ ఉంటుందని భావించారు. అయితే అనూహ్యంగా రాష్ట్ర ప్రభుత్వమే తాజాగా సంజయ్ జాజును తెలంగాణ కేడర్‌కు తిరిగి పంపించాలని కేంద్రాన్ని కోరడంతో దాదాపు 12 ఏళ్ల తర్వాత ఆయన తిరిగి సొంత కేడర్ అయిన తెలంగాణకు వస్తున్నారు. సంజయ్ జాజును కేడర్‌కు పిలిపించుకోవడం ద్వారా ప్రభుత్వం ఒక బలమైన సంకేతాన్ని పంపిందనే చర్చ మొదలైంది. వచ్చే కొన్ని రోజుల్లో తెలంగాణ పాలనా యంత్రాంగంలో కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. సంజయ్ జాజు ప్రస్తుతం ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఆయన అంతకుముందు సమాచార, పౌర సంబంధాల శాఖ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఐటీ ముఖ్యకార్యదర్శిగా, జీహెచ్ఎంసీ కమిషనర్‌గా, విశాఖపట్టణం కమిషనర్‌గా, పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా, సహాయ పునరావాస శాఖ కమిషనర్‌గా, నీటిపారుదల ఆయకట్టు ప్రాంత అభివృద్ధి శాఖ కమిషనర్‌గా, ఏపీఐఐసీ వీసీ అండ్ ఎండీగా పనిచేశారు.

# ఏసీబీ వలలో మరో పెద్ద చేప...

తెలంగాణలో అవినీతి అధికారులపై ఏసీబీ (అవినీతి నిరోధక శాఖ) వరుస దాడులు కొనసాగిస్తోంది. తాజాగా, ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో నిజామాబాద్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కొమ్మురి మల్లారెడ్డిని ఏసీబీ అధికారులు మంగళవారం అరెస్ట్ చేశారు. అవినీతి కార్యకలాపాలకు పాల్పడి, అక్రమ మార్గాల్లో ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలతో మల్లారెడ్డిపై ఏసీబీ కేసు నమోదు చేసింది. ఇందులో భాగంగా మంగళవారం మల్లారెడ్డి నివాసంతో పాటు ఆయన బంధువులు, బినామీలకు చెందిన మొత్తం 10 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. ఈ సోదాల్లో ఐదు భవనాలు (నాలుగు ఇళ్లు, ఒక వాణిజ్య సముదాయం), 8 ఖాళీ ప్లాట్లు, 10.23 ఎకరాల వ్యవసాయ భూమిని అధికారులు గుర్తించారు. వీటితో పాటు రూ.3.31 లక్షల నగదు, బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.50 లక్షలు, ఒక గ్రాండ్ విటారా కారు, ఒక టీవీఎస్ స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆస్తుల డాక్యుమెంట్ విలువ సుమారు రూ.3 కోట్లు ఉండగా, బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ చాలా రెట్లు అధికంగా ఉంటుందని ఏసీబీ అంచనా వేస్తోంది.మల్లారెడ్డి భార్య, కుటుంబ సభ్యుల పేర్లపై ఉన్న మూడు బ్యాంక్ లాకర్లను కూడా గుర్తించామని, వాటిని విచారణలో భాగంగా త్వరలోనే తెరుస్తామని అధికారులు తెలిపారు. నిందితుడిని ఏసీబీ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించనున్నారు.వారం రోజుల క్రితమే ల్యాండ్స్ అండ్ సర్వేస్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరిని కూడా ఏసీబీ ఇలాగే అక్రమాస్తుల కేసులో అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. నరహరి కేసులో సుమారు రూ.13 కోట్లకు పైగా ఆస్తులు, రూ.1.54 కోట్ల నగదు, భారీగా బంగారం వెలుగుచూశాయి. వరుస అరెస్టులతో అవినీతి అధికారుల్లో కలవరం మొదలైంది.

# రేవంత్ ఏ స్కీమ్ తెచ్చినా..

బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడిన కేటీఆర్, "రేవంత్ రెడ్డి కన్నంతా మెట్రో భూముల మీదే పడింది. ఏ స్కీమ్ తెచ్చినా దాని వెనుక ఒక స్కామ్ పక్కా ఉంటుంది" అని ఆరోపించారు. మెట్రో సమీపంలో 280 ఎకరాల విలువైన భూములు ఉన్నాయని, వీటి విలువ సుమారు రూ.30 వేల కోట్లు అని తెలిపారు. రేవంత్ రెడ్డి ఈ భూములను తన అన్నదమ్ములు, బావమరుదులు, అల్లుళ్లకు కట్టబెట్టడానికే మెట్రోను స్వాధీనం చేసుకున్నారని ఆరోపించారు. దీని కోసం ప్రజలపై రూ.14 వేల కోట్ల భారం మోపారని విమర్శించారు."కేసీఆర్ ప్రభుత్వం 72 కిలోమీటర్ల మెట్రోను బ్రహ్మాండంగా నిర్మించింది. ఎయిర్‌పోర్ట్ మెట్రో టెండర్లు కూడా పూర్తి చేసి, 2023 జూన్-జులైలోనే పనులు ప్రారంభించాల్సి ఉండగా, రేవంత్ రెడ్డి వచ్చి ఎయిర్‌పోర్ట్ మెట్రోను రద్దు చేశారు. ఇది తుగ్లక్ నిర్ణయం" అని కేటీఆర్ మండిపడ్డారు.ఎయిర్‌పోర్ట్ మెట్రో కొనసాగి ఉంటే ఈ పాటికి పూర్తి అయి ఉండేదని చెప్పారు. భూసేకరణ సమస్య కూడా లేకుండా, ఔటర్ రింగ్ రోడ్డును అనుసంధానం చేసి ట్రాఫిక్ సమస్యలు తగ్గించాలని ఆలోచన చేశామని కేటీఆర్ గుర్తు చేశారు.

# తెలంగాణ అభివృద్ధికి ఎప్పుడూ కృషి చేస్తానన్న కేంద్ర మంత్రి

మంత్రులతో భేటీ అయ్యేలా తాను సమన్వయం చేసినట్లు వెల్లడించారు.జూన్ 22న అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం జరిగిందని కిషన్ రెడ్డి వెల్లడించారు. ఇవాళ కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, అశ్విని వైష్ణవ్‌తో కలిసి మరో సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. ఈ సమావేశాలు సానుకూల వాతావరణంలో జరిగాయని పేర్కొన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి తనకు రెండుసార్లు లేఖ రాసి కేంద్ర మంత్రులతో భేటీకి అవకాశం కల్పించాలని కోరినట్లు తెలిపారు.కేంద్ర మంత్రివర్గంలో తెలంగాణ ప్రతినిధిగా రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ఎప్పుడూ కృషి చేస్తానని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణకు సంబంధించిన అభివృద్ధి అంశాల్లో తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.

# లోయలోకి తోసేసి..

ముంబై: మేఘాలయ హనీమూన్ మర్డర్ ఘటనను మరువకముందే, మహారాష్ట్రలోని పుణెలో అలాంటి ఘటనే మరొకటి వెలుగులోకి వచ్చింది. మేఘాలయ కేసులో పెండ్లయిన తర్వాత ప్రియుడి సాయంతో భర్తను హతమార్చగా, పుణె కేసులో పెండ్లికి ముందే ప్రియుడితో కాబోయే భార్య హత్య చేసింది. కేసు వివరాల్లోకి వెళితే.. మహారాష్ట్రలోని పుణెలో వ్యాపారవేత్త కేతన్ అగర్వాల్ (26)కు, సియా గోయల్ (20)కు పెండ్లి నిశ్చయమైంది. వారిద్దరూ ఈ నెల 18న పుణెలోని చారిత్రాత్మక లోహగఢ్ కోటకు ఔటింగ్‌కు వెళ్లారు. అక్కడ అగర్వాల్ ట్రెకింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు లోయలో పడి మరణించినట్టు ఆయన కాబోయే భార్య సియా గోయల్ చెప్పడంతో పోలీసులు కూడా ప్రమాదంగానే భావించారు. అయితే మొబైల్ ఫోన్లు, డిజిటల్ రికార్డులను పరిశీలించడంతో పాటు పుణె గ్రామీణ పోలీసులు జరిపిన దర్యాప్తులో సియా గోయల్‌కు, చేతన్ దరి అనే యువకుడితో సంబంధం కలిగి ఉన్నట్లు వెల్లడైంది. వారిద్దరూ కలిసి కేతన్‌ను హతమార్చడానికి కుట్ర పన్నినట్టు నిర్ధారించారు. కేతన్‌తో వివాహ నిశ్చయానికి ముందే సియాకు పుణెకు చేతన్ బాబులాల్ చౌదరి (22)తో సంబంధం ఉంది. దీంతో కేతన్‌తో పెండ్లి ఇష్టం లేని సియా ప్రియుడితో కలిసి అతని అడ్డు తొలగించాలని నిర్ణయించింది. దీంతో ఔటింగ్ పేరుతో కేతన్‌ను లోహగఢ్ కోటకు అతడిని తీసుకుని వెళ్లింది. అక్కడికి ప్రియుడిని రప్పించింది. తర్వాత ఇద్దరూ కలిసి కేతన్‌ను పైనుంచి కిందికి తోసేశారు.

**రూ.17 కోట్లతో పెండ్లికి భారీ ఏర్పాట్లు**

అగర్వాల్, సియాల పెండ్లి ఈ ఏడాది నవంబర్‌లో జరుగాల్సి ఉండగా, మొత్తం 17 కోట్ల రూపాయలతో పెండ్లి ఏర్పాట్లు ఘనంగా చేస్తున్నారు. రెండు చార్టర్డ్ విమానాలు బుక్ చేయడంతో పాటు ఒక విలాసవంతమైన రిసార్ట్‌లో దాదాపు 40 గదులను బుక్ చేశారు. పెండ్లి ఇష్టం లేని సియా..తన పుట్టిన రోజుకు ఒక రోజు ముందు ప్రియుడితో కలిసి కాబోయే భర్తను హతమార్చడానికి కుట్ర చేసి దానిని అమలు చేసింది. తర్వాత వారిద్దరూ అక్కడే పుట్టిన రోజు వేడుకలు కూడా జరుపుకున్నారు.

**హత్య చేసి.. ఇన్‌స్టా పోస్ట్**

జూన్ 18న హత్య జరిగిన తర్వాత సియా అతని మృతికి సంతాపం తెలుపుతూ భావోద్వేగభరితమైన ఒక ఇన్‌స్టా స్టోరీని పంచుకుంది. 'నా పుట్టిన రోజు నాడు నన్ను వదిలి వెళ్లిపోయావు. నిన్ను ఎంతగా ప్రేమిస్తుండగా, నన్ను ఎందుకు వదిలి వెళ్లావు? నీ ఆత్మకు శాంతి కలుగుకాక' అని ఆమె తన పోస్ట్‌లో పేర్కొన్నది. కాగా, ఇండోనేషియాలోని బాలికి ప్రీ వెడ్డింగ్ షూట్ కార్యక్రమాన్ని కూడా సియానే చెడగొట్టింది. ఎయిర్‌పోర్టుకు వెళ్లేముందు ఆఖరి క్షణంలో కేతన్ పాస్‌పోర్ట్‌ను మాయం చేసింది. దీంతో వారి బాలీ ప్రయాణం అర్ధాంతరంగా రద్దయ్యిందని కేతన్ తండ్రి ఆరోపించారు.

**నాలుగు రోజుల క్రితమే హత్యకు విఫలయత్నం**

కేతన్ హత్య జరగడానికి నాలుగు రోజుల క్రితమే అతనిపై సియా గోయల్ అదే ప్రదేశంలో హత్య చేయడానికి విఫలయత్నం చేసింది. జూన్ 14న వారు లోహగఢ్ కోటకు రాగా, కొండ అంచున నిలబడి ఉన్న అతడిని సియా గోయల్ తోసి వేసింది. అయితే ఒక చెట్టు అతడి ప్రాణాన్ని కాపాడింది. తాను కేతన్‌కు సమీపంలో ఒక పామును చూశానని, అతడిని రక్షించడానికే తోసివేశానంటూ తర్వాత సియా బంధువులకు తెలిపింది. ఆ ఘటన తర్వాత గోయల్ తిరిగి అక్కడికి వెళ్లడానికి ఇష్టపడలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే తన పుట్టిన రోజును స్నేహితులతో వేడుకలు జరుపుకుందామని ఆమె అతనిపై పదేపదే ఒత్తిడి తెచ్చి రెండోసారి అక్కడికి తీసుకువెళ్లి ప్రియుడి సహాయంతో హత్య చేసింది.

# ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో పాల్గొన్న మంత్రి నారా లోకేశ్

అందజేశారు. మంగళవారం ఉండవల్లిలోని తన నివాసానికి వచ్చిన బీఎల్ఓకు ఆయన అవసరమైన పత్రాలను, సమాచారాన్ని సమర్పించారు. భారత ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా చేపట్టిన "ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ 2026" కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా లోకేశ్ పిలుపునిచ్చారు. పారదర్శకమైన, కచ్చితమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు ప్రజలందరూ సహకరించాలని, తమ ఓటు వివరాలను సరిచూసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మంగళగిరి నియోజకవర్గ శాసనసభ్యుడిగా లోకేశ్ స్వయంగా ఈ ప్రక్రియలో పాల్గొని ప్రజలకు ఆదర్శంగా నిలిచారు.ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం అధికారులు ఇంటింటి సర్వే ద్వారా ఓటర్ల వివరాలను సేకరిస్తున్నారు. ఈ ప్రక్రియలో భాగంగా నకిలీ ఓట్లు, మరణించిన వారి పేర్లను తొలగించడంతో పాటు, అర్హులైన నూతన ఓటర్ల నమోదును చేపడుతున్నారు. అభ్యంతరాలు పరిశీలన అనంతరం జులై 21న ముసాయిదా జాబితాను, సెప్టెంబర్ 22న తుది ఓటర్ల జాబితాను అధికారికంగా విడుదల చేయనున్నారు.

# హర్మూజ్ జలసంధిలో రికార్డు స్థాయిలో ఆయిల్ రవాణా: ట్రంప్ ప్రకటన

అమెరికా, ఇరాన్‌ల మధ్య ఇటీవల కుదిరిన ఒప్పందం ఆశించిన సత్ఫలితాలనిస్తోందని, హర్మూజ్ జలసంధి ద్వారా చమురు రవాణా తిరిగి భారీగా పుంజుకుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. సోమవారం ఒక్కరోజే ఈ జలసంధి గుండా 1.9 కోట్ల బ్యారెళ్ల చమురు రవాణా జరిగిందని, ఇది ఒక సంచలనాత్మక రికార్డు అని ఆయన ప్రకటించారు.ఈ మేరకు మంగళవారం తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో ట్రంప్ ఒక పోస్ట్ చేశారు. "నిన్న హర్మూజ్ జలసంధి నుంచి 19 మిలియన్ బ్యారెళ్ల చమురు సరఫరా అయింది. ఇది ఒక సరికొత్త రికార్డు. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. ప్రపంచం ఇప్పుడు మరింత సురక్షితమైన ప్రదేశంగా మారింది" అని ఆయన పేర్కొన్నారు. ఈ సానుకూల పరిణామంతో అంతర్జాతీయ విపణిలో ముడి చమురు ధరలు తగ్గాయి.నిరసనలు, తప్పుడు ప్రచారాల ద్వారా అమెరికా విజయాన్ని తక్కువ చేసే ప్రయత్నాలు జరిగినప్పటికీ, భవిష్యత్తులో అత్యున్నత స్థాయి అణు తనిఖీలకు ఇరాన్ అంగీకరించిందని ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ అణు కార్యకలాపాలపై పారదర్శకతకు ఇది భరోసా ఇస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. ఒకవేళ ఇరాన్ ఈ నిబంధనలకు కట్టుబడి ఉండకపోతే, తదుపరి చర్చలకు తావుండదని హెచ్చరించారు. ఇరాన్ చేసిన కొన్ని ప్రతిపాదనల ప్రాతిపదికన, ఎలాంటి దిగ్బంధనం లేకుండా హర్మూజ్ జలసంధిని తెరిచేందుకు తాను అంగీకరించినట్లు ట్రంప్ వివరించారు.ఒకవేళ తిరిగి దిగ్బంధనాన్ని విధిస్తే నౌకల రాకపోకలు ఎక్కడికక్కడే నిలిచిపోతాయని, అయితే ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో అటువంటి అవసరం రాకపోవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఒప్పందంలో భాగంగా అమెరికా విడుదల చేసే నిధులను ఇరాన్ కేవలం ఆహారం, వైద్య సామగ్రి వంటి అత్యవసరాల కోసమే వినియోగించగలదని, వాటిని కూడా కేవలం అమెరికా నుంచే కొనుగోలు చేయాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.ప్రపంచ సముద్ర వాణిజ్యంలో దాదాపు 20 శాతం చమురు రవాణా సౌదీ అరేబియా, యూఏఈ, ఇరాక్ వంటి దేశాల నుంచి హర్మూజ్ జలసంధి ద్వారానే సాగుతుంది. గత కొంతకాలంగా ఇరాన్‌పై అమెరికా విధించిన ఆంక్షలు, దిగ్బంధనాల కారణంగా ఈ మార్గంలో చమురు సరఫరాకు తీవ్ర ఆటంకాలు ఏర్పడి ధరలు పెరిగాయి. అయితే, తాజా ఒప్పందంలో భాగంగా అణు తనిఖీలకు ఇరాన్ సమ్మతించడంతో ప్రాంతీయ ఉద్రిక్తతలు సద్దుమణిగాయి.

# నాగరిక దేవో భవ!

మంగళవారం తన వద్దకు వచ్చిన 183 మంది 2024 ఐఏఎస్ బ్యాచ్ ట్రెయినీ అధికారులతో ఆయన మాట్లాడారు. వీరంతా వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాల్లో సహాయ కార్యదర్శులుగా అటాచ్ అయ్యారు. 'అభివృద్ధి పరంగా ఎదురయ్యే ప్రధాన సవాళ్లను ఎవరికివారుగా పరిష్కరించడం సాధ్యం కాదు. అర్థవంతమైన, శాశ్వతమైన ఫలితాలను సాధించాలంటే వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమర్థవంతమైన సమన్వయం అత్యంత కీలకం'అని మోదీ తెలిపారు. యువ అధికారులు బలమైన లక్ష్య శుద్ధి, ఆవిష్కరణలు, ప్రజా కేంద్రిత పాలనా విధానంతో దేశ నిర్మాణానికి అంకితం కావాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే, ప్రతి పరిపాలనా ఫైలు వెనుక ఒక సామాన్యుడి జీవితంపై పడే ప్రభావాన్ని ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని వారిని కోరారు.

**పౌరుడికే ప్రథమ ప్రాధాన్యం**

నాగరిక్ దేవో భవ అనే మంత్రాన్ని ఎల్లవేళలా గుర్తుంచుకుని తీసుకునే ప్రతి నిర్ణయంలోనూ పౌరులకే ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. దేశ నిర్మాణంలో తమ వంతు పాత్రను నిరంతరం సమీక్షించుకుంటూ ఉండాలని, నిర్వహించే బాధ్యతలను బట్టి కాకుండా సాధించిన స్పష్టమైన ఫలితాల ద్వారా సంతృప్తిని పొందాలని సూచించారు. 'రెండేళ్ల పాటు క్షేత్రస్థాయి పరిశీలన, పరిపాలనాపరమైన అనుభవం తర్వాత ఇప్పుడు మీరు ఒక కీలకమైన దశలో ఉన్నారు. ఇక్కడ తీసుకునే నిర్ణయాలు కేవలం మీ కెరీర్‌ను మాత్రమే కాదు, కోట్లాది పౌరుల భవిష్యత్తును సైతం మారుస్తాయి'అని మోదీ వారితో అన్నారు. నిజాయితీ, సున్నితత్వం, నిబద్ధతతో నిజజీవిత పరిస్థితులను ఎదుర్కొన్నప్పుడే ప్రజా సేవలో అసలైన పరీక్ష మొదలవుతుందని పేర్కొన్నారు.

**అభివృద్ధి చెందిన భారత్ లక్ష్యం**

వికసిత్ భారత్ 2047 దార్శనికతను ప్రస్తావించిన మోదీ.. 'రాబోయే దశాబ్దాలలో తీసుకునే ప్రతి విధానం, పరిపాలనాపరమైన నిర్ణయం కూడా అభివృద్ధి చెందిన భారత్‌ను నిర్మించే దిశగానే సాగాలి. ప్రభుత్వంలోని అన్ని విభాగాలు కలిసికట్టుగా పనిచేయాలి. ప్రస్తుతం దేశ ప్రాధాన్యతలలో 'ఆత్మనిర్భర్ భారత్', 'మేక్ ఇన్ ఇండియా', ఉత్పాదక రంగ వృద్ధి, ఇంధన భద్రత, యువతకు అవకాశాలను సృష్టించడం వంటివి ఉన్నాయి'అని యు ఐఏఎస్‌లకు ఆయన వివరించారు. ప్రస్తుత బ్యాచ్‌లోని ఐఏఎస్ అధికారులలో 40 శాతానికి పైగా మహిళలే ఉన్నారు. వారి శక్తి, ప్రతిభ, అంకితభావం దేశ అభివృద్ధి ప్రయాణాన్ని సరికొత్త ఎత్తులకు తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.

# ఉద్యోగులపై వరాల జల్లు..

కంట్రోల్ ఎస్ డేటా సెంటర్స్ (అనకాపల్లి): రూ.2,788 కోట్ల పెట్టుబడితో 1000 మెగావాట్ల డేటా సెంటర్.ప్రొటేరియల్ ఇండియా (అనకాపల్లి): రూ.2,250 కోట్ల పెట్టుబడితో నియోడిమియం ఐరన్ బోరాన్ మాగ్నెట్ తయారీ పరిశ్రమ. 530 మందికి ఉపాధి.నాఖీయాచీజు ఇండియా (కాకినాడ): రూ.1,900 కోట్ల పెట్టుబడితో వాడిన వంట నూనెల నుంచి విమాన ఇంధనం తయారు చేసే యూనిట్. 2,500 మందికి ఉపాధి.

ఎన్ఎస్ మాగ్నటెక్ (తిరుపతి): రూ.1,250 కోట్ల పెట్టుబడితో రేర్ ఎర్త్ పర్మనెంట్ మాగ్నెట్ తయారీ. 400 మందికి ఉపాధి.

ఏపీ జేఎస్‌డబ్ల్యూ స్టీల్ (ప్రకాశం): రూ.1,230 కోట్లతో స్టీల్ బెనిఫికేషన్ ప్లాంట్.

వీటితో పాటు రేర్ ఎర్త్ మెటల్స్ వెలికితీత, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను ప్రోత్సహించడం ద్వారా రాష్ట్రంలో పారిశ్రామికంగా ఎండ్-టు-ఎండ్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

**అమరావతికి జవసత్వాలు**

ఐదేళ్లుగా నిలిచిపోయిన రాజధాని అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు క్యాబినెట్ పలు నిర్ణయాలు తీసుకుంది.

అమరావతిలో డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టమ్ కోసం గతంలో టాబ్ బ్రీడ్ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేసి, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా 35,000 టన్నుల సామర్థ్యంతో కొత్త వ్యవస్థ ఏర్పాటుకు నిర్ణయం.

ల్యాండ్ పూలింగ్ రైతులకు కేటాయించిన ప్లాట్లలో రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల పనులకు సంబంధించిన టెండర్లకు ఆమోదం.

రైతుల ప్లాట్ల సరిహద్దుల వివాదాలను పరిష్కరించేందుకు అవసరమైన రెక్టిఫికేషన్ డీడ్‌లపై స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజుల నుంచి మినహాయింపు.

పనుల పర్యవేక్షణ కోసం ఏపీసీఆర్‌డీఏలో 95 తాత్కాలిక పోస్టుల (డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు) మంజూరు.

ఆంధ్రప్రదేశ్ జ్యుడీషియల్ అకాడమీ భవన నిర్మాణానికి రూ.130.38 కోట్లకు టెండర్ ఆమోదం.


**ఉద్యోగులకు శుభవార్త**

ప్రభుత్వ ఉద్యోగుల దీర్ఘకాలిక డిమాండ్లపై క్యాబినెట్ సానుకూలంగా స్పందించింది. 2004కు ముందు నోటిఫికేషన్ పొంది, ఆ తర్వాత నియామకం అయిన 2003 డీఎస్సీ టీచర్లు, 10/99 గ్రూప్-1 ఉద్యోగులు సహా మొత్తం 10,715 మంది సీపీఎస్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) వర్తింపజేయాలని నిర్ణయించింది. షెడ్యూల్ 9, 10 పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థల (పీఎస్‌యూ) ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. 62 ఏళ్లు పూర్తికాని రిటైర్డ్ ఉద్యోగులు తిరిగి విధుల్లో చేరేందుకు అవకాశం కల్పించారు.

**పోర్టులు, పర్యాటకం, ఇతర నిర్ణయాలు**

పోర్టుల అభివృద్ధి: కేంద్ర ప్రభుత్వ నూతన చట్టాలకు అనుగుణంగా మచిలీపట్నం పోర్టు పరిధిని 64 కి.మీ. నుంచి 15 కి.మీ.కు, రామయ్యపట్నం పోర్టు పరిధిని 51 కి.మీ. నుంచి 15 కి.మీ.కు కుదిస్తూ నోటిఫికేషన్ల జారీకి ఆమోదం. రామయ్యపట్నం పోర్టును డీబీఎఫ్ఓటీ పద్ధతిలో అభివృద్ధి చేసేందుకు ఆపరేటర్ నియామకానికి ఆర్ఎఫ్‌పీ జారీకి అనుమతి.పర్యాటకం: గ్రామీణ ప్రాంతాల్లో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు 'హోమ్ స్టే', 'బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్' ఏర్పాటును సులభతరం చేస్తూ పర్యాటక పాలసీకి సవరణలు. తిరుపతి మినహా రాష్ట్రంలోని ఇతర విమానాశ్రయాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో బార్లు, రిటైల్ మద్యం దుకాణాల ఏర్పాటుకు నూతన విధానానికి ఆమోదం.రవాణా శాఖ: ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న టూరిస్ట్ బస్సులను రాష్ట్రంలోకి ఆకర్షించేందుకు, ఆల్ ఇండియా టూరిస్ట్ పర్మిట్ వాహనాల త్రైమాసిక పన్నును ప్రతి సీటుకు రూ.4,000 నుంచి రూ.2,500కు తగ్గింపు.

# ప్రైవేట్ పాఠశాలల ఆగడాలు.. పిల్లల భవిష్యత్తుతో వ్యాపారమా?



## నిబంధనలు బేఖాతరు.. ఫీజుల దందా.. మౌలిక వసతులపై ప్రశ్నలు

## విద్యాశాఖ పర్యవేక్షణ లోపమా..? లేక యాజమాన్యాల ఇష్టారాజ్యమా..?

**విద్యాశాఖపై ప్రశ్నలు**

- జిల్లాలో ఎన్ని ప్రైవేట్ పాఠశాలలకు పూర్తి అనుమతులు ఉన్నాయి?
- ఎన్ని పాఠశాలలు తాత్కాలిక భవనాల్లో నడుస్తున్నాయి?
- ఫీజుల నియంత్రణ కమిటీలు పనిచేస్తున్నాయా?
- గత మూడేళ్లలో ఎన్ని పాఠశాలలపై చర్యలు తీసుకున్నారు?
- భద్రతా ప్రమాణాలు ఉల్లంఘించిన వారిపై ఎలాంటి చర్యలు చేపట్టారు?

అనే అంశాలపై జిల్లా విద్యాశాఖ ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని తల్లిదండ్రులు కోరుతున్నారు.



**మేడ్చల్, ప్రత్యేక ప్రతినిధి:**
విద్య అనేది సమాజ నిర్మాణానికి పునాది. పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే పవిత్రమైన రంగంగా భావించే విద్యా వ్యవస్థలో ప్రస్తుతం వ్యాపార ధోరణులు పెరుగుతున్నాయనే విమర్శలు జిల్లాలో తీవ్రంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలను పక్కనపెట్టి అడ్మిషన్లు, ఫీజుల వసూళ్లపైనే దృష్టి సారిస్తున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 2026-27 విద్యా సంవత్సరం ప్రారంభమైన వెంటనే జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల మధ్య అడ్మిషన్ల కోసం తీవ్ర పోటీ నెలకొంది. "ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్", "ఐఐటీ ఫౌండేషన్", "ఒలింపియాడ్ ట్రైనింగ్", "స్మార్ట్ క్లాసులు", "డిజిటల్ ఎడ్యుకేషన్" పేర్లతో తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నా, వాస్తవ పరిస్థితులు మాత్రం ఆ ప్రచారాలకు పూర్తి భిన్నంగా ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ఒకే గదిలో 70 మంది విద్యార్థులు..!**

నిబంధనల ప్రకారం విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు, గాలి, వెలుతురు, కూర్చునే సౌకర్యాలు ఉండాలి. కానీ కొన్ని పాఠశాలల్లో ఒకే గదిలో 60 నుంచి 70 మంది వరకు విద్యార్థులను కుక్కిపెడుతున్నట్లు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. దీంతో విద్యార్థుల ఏకాగ్రత, ఆరోగ్యం, విద్యా ప్రమాణాలపై ప్రతికూల ప్రభావం పడుతోందని విద్యావేత్తలు చెబుతున్నారు.

**అనుమతులు ఒకటి.. నిర్వహణ మరోటి..?**

జీం2 భవనాలకు అనుమతులు పొందిన కొన్ని పాఠశాలలు ఇప్పటికీ తాత్కాలిక రేకుల షెడ్లలో తరగతులు నిర్వహిస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. అనుమతుల సమయంలో చూపించిన భవనాలు, ప్రస్తుతం నిర్వహిస్తున్న తరగతుల మధ్య భారీ వ్యత్యాసం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**ఫీజుల పేరిట దోపిడీ..?**

అడ్మిషన్ ఫీజు, బిల్డింగ్ ఫండ్, యాక్టివిటీ ఫీజు, ట్రాన్స్‌పోర్ట్ ఫీజు, పుస్తకాలు, యూనిఫాం, డిజిటల్ ఫీజు పేర్లతో వేల నుంచి లక్షల రూపాయల వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ మార్గదర్శకాలు ఉన్నప్పటికీ ఫీజుల నియంత్రణ అమలులో లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు.



**రేకుల గదుల్లో విద్యాబోధన**

వేసవిలో భరించలేని వేడి, వర్షాకాలంలో లీకేజీలు, సరైన వెంటిలేషన్ లేకపోవడం వంటి సమస్యల మధ్య విద్యార్థులు చదువుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. చిన్నారుల ఆరోగ్యంపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటుందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాగునీరు, మరుగుదొడ్ల పరిస్థితి దారుణం కొన్ని పాఠశాలల్లో స్వచ్ఛమైన తాగునీరు, బాలురు-బాలికలకు వేర్వేరు మరుగుదొడ్లు, పరిశుభ్రత ప్రమాణాలు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా బాలికల కోసం తగిన సౌకర్యాలు లేకపోవడం విద్యా హక్కుల ఉల్లంఘనగా భావిస్తున్నారు.

**ఉపాధ్యాయుల కొరత.. నాణ్యతపై ప్రభావం**

విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నా అర్హత కలిగిన ఉపాధ్యాయులను నియమించకుండా ఖర్చులు తగ్గించే ప్రయత్నం జరుగుతోందనే విమర్శలు ఉన్నాయి. కొన్నిచోట్ల ఒకే ఉపాధ్యాయుడు రెండు మూడు తరగతులను నిర్వహిస్తున్నట్లు సమాచారం.

**అర్హతలేని టీచర్లు..?**

కొన్ని విద్యాసంస్థల్లో బీఈడ్, డీఈడ్, టెట్ అర్హతలు లేని ఉపాధ్యాయులతో బోధన కొనసాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో విద్యా ప్రమాణాలు పడిపోతున్నాయని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**భద్రతా ప్రమాణాలు గాలికొదిలి..**

ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్లు, అత్యవసర నిష్క్రమణ మార్గాలు, సీసీ కెమెరాలు, స్కూల్ బస్సుల ఫిట్‌నెస్, సెక్యూరిటీ గార్డులు వంటి అంశాల్లో కూడా అనేక పాఠశాలలు నిబంధనలు పాటించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

**ఆటస్థలాలు లేకుండానే అనుమతులా..?**

పాఠశాలలకు తప్పనిసరిగా ఉండాల్సిన ఆటస్థలాలు, క్రీడా సదుపాయాలు లేకుండానే కొన్ని విద్యాసంస్థలు నిర్వహణ కొనసాగిస్తున్నాయని సమాచారం. పిల్లల శారీరక వికాసాన్ని పూర్తిగా విస్మరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

**ఆర్‌టీఈ చట్టం అమలు అవుతోందా..?**

విద్యా హక్కు (ఆర్టీఈ) చట్టం ప్రకారం బలహీన వర్గాలకు కేటాయించాల్సిన సీట్లు వాస్తవంగా భర్తీ అవుతున్నాయా? లేదా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దీనిపై ప్రత్యేక ఆడిట్ అవసరమని సామాజిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

**విద్యాశాఖ తనిఖీలు కేవలం కాగితాలకే పరిమితమా..?**

ప్రతి సంవత్సరం పాఠశాలల గుర్తింపు పునరుద్ధరణ సమయంలో మౌలిక వసతులు, ఉపాధ్యాయుల అర్హతలు, విద్యార్థుల భద్రత, భవన అనుమతులు పరిశీలించాల్సి ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో సమగ్ర తనిఖీలు జరగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.



**తల్లిదండ్రుల డిమాండ్**

జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, మౌలిక వసతులు, ఉపాధ్యాయుల అర్హతలు, ఫీజుల నిర్మాణం, భద్రతా ప్రమాణాలపై సమగ్ర తనిఖీలు చేపట్టాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన విద్యాసంస్థలు నిజంగా విద్యా ఆలయాలుగా పనిచేస్తున్నాయా? లేక లాభాల కోసం నడిచే వ్యాపార కేంద్రాలుగా మారుతున్నాయా? అన్న ప్రశ్నకు సమాధానం విద్యాశాఖ చేపట్టే తనిఖీలు, చర్యల ద్వారానే లభించనుంది.

# పల్స్ పోలియో విజయవంతానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

## జూన్ 28న నిర్వహించే పోలియో చుక్కల కార్యక్రమంపై విస్తృత ప్రచారం చేపట్టాలి

**గుమ్మడిదల, జూన్ 23 ( నేటి ప్రస్థానం ) :** జూన్ 28, ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి గుమ్మడిదల మున్సిపాలిటీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని గ్రామాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని వైద్యాధికారి డాక్టర్ ఎస్. మధుకర్ సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, అంగన్వాడీ కేంద్రాల్లో ప్రతిరోజు ఉదయం విద్యార్థుల చేత "ఆదివారం పోలియో చుక్కల కార్యక్రమం" అనే నినాదాలను పలికించి గ్రామ ప్రజలకు సమాచారం చేరేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో ప్రతి కుటుంబానికి పోలియో చుక్కల కార్యక్రమం గురించి అవగాహన కలుగుతుందని తెలిపారు. అలాగే గ్రామాల్లో చెత్త సేకరణ నిర్వహించే వాహనాల్లోని మైకుల ద్వారా పోలియో కార్యక్రమంపై ప్రచారం చేపట్టాలని సూచించారు. దేవాలయాలు, మసీదులు, చర్చిలు తదితర ప్రార్థనా మందిరాల్లో కూడా మైకుల ద్వారా ప్రజలకు పోలియో చుక్కల ప్రాధాన్యతను తెలియజేయాలని పేర్కొన్నారు. మున్సిపల్ సిబ్బంది, ఆరోగ్య శాఖ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, పొదుపు సంఘాల సభ్యులు, యువజన సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు తమ పరిధిలోని ప్రజలకు ఈ కార్యక్రమంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం ద్వారా పోలియో మహమ్మారి నుండి పిల్లలను రక్షించవచ్చని, ఈ కార్యక్రమాన్ని ప్రజలందరూ విజయవంతం చేయాలని డాక్టర్ ఎస్. మధుకర్ పిలుపునిచ్చారు.





## శేరిలింగంపల్లి బీ ఆర్ ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న సింధు ఆదర్శ రెడ్డి

కార్యకర్తలు పట్టుదలతో పనిచేసి బి ఆర్ ఎస్ పార్టీ ప్రభుత్వాన్ని సాధించుకోవాలి

బి ఆర్ ఎస్ పార్టీ పటాన్చెరు కాంసెన్సీ ఇంచార్జ్... వెన్నవరపు ఆదర్శ్ రెడ్డి



**మియాపూర్/పటాన్చెరు :** మియాపూర్‌లోని నరేన్ గార్డెన్స్‌లో శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి భారతీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వి.సింధు ఆదర్శ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. రాబోయే ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ఎస్ఐఆ ర్పై ప్రతి కార్యకర్త అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి బూత్ స్థాయిలో బూత్ లెవల్ ఏజెంట్లు కీలక పాత్ర పోషించాలని తెలిపారు. ఓటర్ల జాబితాలో కొత్త ఓటర్ల నమోదు, తొలగింపులు, నకిలీ ఓట్ల గుర్తింపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. త్వరలో ప్రారంభం కానున్న బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి బూత్ నుంచి ఇద్దరు సభ్యులను నియమించి డిజిటల్ విధానంలో సభ్యత్వ నమోదు పూర్తి చేయాలని సూచించారు. కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకోవాలని కేటీఆర్ కోరారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సమావేశం సందర్భంగా పార్టీ కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. కార్యకర్తల్లో నూతన ఉత్సాహం నింపేలా ఈ ఆత్మీయ సమావేశం కొనసాగింది.

### బాసర జ్ఞాన సరస్వతి ఆలయం ప్రాంగణంలో..

## అమ్మవారి కిరీటం, హుండీ చోరీ

**మహంకాళీ అమ్మవారి వెండి కిరీటంతో పాటు హుండీ అపహరణ**

**సోమవారం రాత్రి జరిగిన ఘటన, మంగళవారం ఉదయం వెలుగులోకి**

**సీసీటీవీ ఫుటేజ్‌లో ఇద్దరు ముసుగు దొంగల దృశ్యాలు**

**కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు**

తెలంగాణలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసర జ్ఞాన సరస్వతి ఆలయ ప్రాంగణంలో భారీ చోరీ జరిగింది. సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు ఆలయ సముదాయంలోని మహాకాళి అమ్మవారి ఆలయంలోకి చొరబడి, వెండి కిరీటంతో పాటు హుండీని ఎత్తుకెళ్లారు. ఈ ఘటన మంగళవారం ఉదయం వెలుగులోకి రావడంతో భక్తులు, అధికారులు దిగ్భ్రాంతికి గురయ్యారు. మంగళవారం ఉదయం నిత్య పూజల కోసం వచ్చిన అర్చకులు ఆలయ ద్వారాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఆలయ ప్రాంగణంలోని పై అంతస్తులో ఉన్న మహాకాళి అమ్మవారి ఆలయం గేటును పగలగొట్టిన దొంగలు, సుమారు 1.5 కిలోల బరువున్న వెండి కిరీటాన్ని అపహరించారు. అనంతరం హుండీని పగలగొట్టి అందులోని నగదును దోచుకుని, ఖాళీ హుండీని సమీపంలోనే పడేశారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు. నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిళ, స్థానిక ఎమ్మెల్యే రామారావు పటేల్ ఆలయాన్ని సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా, ఇద్దరు ముసుగు ధరించిన వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించినట్లు గుర్తించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ సాయంతో పోలీసులు ఆధారాలను సేకరిస్తున్నారు. గోదావరి నది తీరాన కొలువుదీరిన ఈ ఆలయాన్ని భక్తులు 'దక్షిణ గంగ'గా పిలుచుకుంటారు. కురుక్షేత్ర యుద్ధం ముగిసిన అనంతరం వేదవ్యాస మహర్షి ఇక్కడ సరస్వతి, మహాలక్ష్మి, మహాకాళి విగ్రహాలను ప్రతిష్ఠించారని పురాణ గాథలు చెబుతున్నాయి. ఇటీవల ఏప్రిల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ. 225 కోట్లతో ఆలయ పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేసిన తరుణంలో, ఈ భారీ చోరీ జరగడం భద్రతా వైఫల్యాలపై పలు అనుమానాలను రేకెత్తిస్తోంది. ఈ ఘటన నేపథ్యంలో ఆలయంలో భక్తుల కానుకల లెక్కింపు ప్రక్రియను అధికారులు తాత్కాలికంగా వాయిదా వేశారు. పోలీసులు కేసు నమోదు చేసి సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తును ముమ్మరం చేశారు. నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని, ఇప్పటివరకు ఎవరినీ అదుపులోకి తీసుకోలేదని వెల్లడించారు. ఇదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా కోయిలకుంట్ల శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయంలోనూ హుండీ చోరీ జరగడం గమనార్హం.

# ఉద్యోగులకు రేవంత్‌రెడ్డి బంపర్ గిఫ్ట్..

**రూపాయి ప్రీమియం లేకుండా రూ.1.2 కోట్ల ఉచిత బీమా!**

**దాదాపు 10 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగుల కోసం ఉచిత ప్రమాద బీమా పథకం**

**అధికారికంగా ప్రారంభించనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

**గురువారం మధ్యాహ్నం రవీంద్రభారతిలో 14 బ్యాంకులతో ఒప్పందం**

**ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.1.2 కోట్లు, విమాన ప్రమాదంలో మరణిస్తే రూ.2 కోట్ల వరకు పరిహారం**

**కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, తాత్కాలిక సిబ్బందికీ బీమా**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలలో ఆర్థిక భద్రతను పెంపొందించే దిశగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మరో అద్భుతమైన సంక్షేమ పథకానికి శ్రీకారం చుట్టింది. లక్షలాది మంది ప్రభుత్వ ఉద్యోగుల కోసం ఉద్దేశించిన సమగ్ర ఉచిత ప్రమాద బీమా పథకాన్ని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి గురువారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వేదికగా


File Photo

అధికారికంగా ప్రారంభించనున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక పథకం అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం 14 ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులతో అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేయనుంది. ఉద్యోగులపై కానీ, ప్రభుత్వ ఖజానాపై కానీ ఎలాంటి ప్రీమియం భారం పడకుండా కేవలం జీతాల ఖాతాలు ఉండే బ్యాంకర్ల భాగస్వామ్యంతోనే ఈ ఉచిత బీమాను అందించడం దేశ చరిత్రలోనే ఇది మొదటిసారి కావడం విశేషం. ఈ సరికొత్త బీమా పథకం ద్వారా రాష్ట్రంలోని రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, తాత్కాలిక సిబ్బందితో కలిపి దాదాపు 10 లక్షల మంది లబ్ధి పొందనున్నారు. బ్యాంక్ ఖాతాల ద్వారా జీతాలు పొందే ప్రతి ఉద్యోగికి ఈ రక్షణ లభిస్తుంది. ఉద్యోగి జీతం పొందే బ్యాంకు నిబంధనలను బట్టి ప్రమాదవశాత్తు మరణిస్తే కనీసం రూ.60 లక్షల నుండి గరిష్టంగా రూ.1.2 కోట్ల వరకు వారి కుటుంబ సభ్యులకు పరిహారం అందుతుంది. ఒకవేళ విమాన ప్రమాదంలో మరణిస్తే ఈ పరిహారాన్ని రూ.2 కోట్లకు పెంచారు. గతంలో సింగరేణి కాలరీస్ కార్మికులకు పైలట్ ప్రాజెక్ట్‌గా ఈ విధానాన్ని అమలు చేయగా, అక్కడ దురదృష్టవశాత్తు మరణించిన సుమారు 45 మంది కార్మికుల కుటుంబాలకు రూ. కోటి చొప్పున పరిహారం అందింది. ఈ పథకం విజయవంతం కావడంతో ప్రభుత్వం ఇప్పుడు దీనిని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన క్యాబినెట్ సమావేశంలోనే ఉద్యోగుల ప్రమాద బీమా పథకానికి ఆమోదం లభించింది. ఇప్పుడు పరిపాలనాపరమైన ఏర్పాట్లు పూర్తి చేసుకుని ఇది కార్యరూపం దాల్చుతోంది. ఈ బీమాతో పాటు సహజ మరణం సంభవిస్తే (60 ఏళ్ల లోపు) రూ.10 లక్షల టర్మ్ లైఫ్ కవర్ కూడా ఉద్యోగులకు లభించనుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయాన్ని తెలంగాణ నాన్-గెజిటెడ్ అధికారుల సంఘం (టీఎన్‌జీవో)తో పాటు వివిధ ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. రవీంద్రభారతిలో జరిగే ప్రారంభోత్సవానికి ఉద్యోగులందరూ తమ గుర్తింపు కార్డులతో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా, జులై మొదటి వారంలో పెద్ద ఎత్తున బహిరంగ సభ నిర్వహించి ఉద్యోగులు, పెన్షనర్లకు క్యాష్‌లెస్ డిజిటల్ హెల్త్ కార్డులను (ఈహెచ్ఎస్) కూడా పంపిణీ చేయడానికి, కొత్త పీఆర్సీ అమలుపై దృష్టి పెట్టడానికి రేవంత్ సర్కార్ వేగంగా అడుగులు వేస్తోంది.

# తెలుగు రాష్ట్రాల్లో ఈ నెలాఖరు వరకు విస్తారంగా భారీ వర్షాలు

**30వ తేదీ వరకు తేలికపాటి నుంచి మోస్తరు, భారీ వర్షాలు**

**తెలంగాణలో 5 డిగ్రీల వరకు తగ్గనున్న ఉష్ణోగ్రతలు**

**నేడు కోస్తాంధ్రలో, 28-30 మధ్య దక్షిణ కోస్తాలో భారీ వర్షాలు**

**తెలంగాణలోని 8 జిల్లాలకు ఎల్లో అలెర్ట్**

ఎండలు, ఉక్కపోతలతో ఇబ్బంది పడుతున్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రజలకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తీపి కబురు అందించింది. రాబోయే వారం రోజుల పాటు (జూన్ 30 వరకు) రెండు రాష్ట్రాలలోనూ నైరుతి రుతుపవనాల ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తాయని అమరావతి, హైదరాబాద్ వాతావరణ కేంద్రాలు వెల్లడించాయి. ఈ కాలంలో అనేక ప్రాంతాలలో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉండగా.. కొన్ని జిల్లాలలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు, గంటకు 30 నుండి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ఈ విస్తారమైన వర్షాల కారణంగా రాబోయే రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 2 నుండి 5 డిగ్రీల సెల్సియస్ వరకు తగ్గే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే.. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఉభయ గోదావరి జిల్లాలతో కూడిన ఉత్తర కోస్తా ప్రాంతాలలో నేడు (24న) అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. 29, 30 తేదీలలో ఇక్కడ వర్షాల తీవ్రత మరింత పెరగొచ్చని అంచనా వేస్తున్నారు. కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు వంటి దక్షిణ కోస్తా జిల్లాలలో ప్రారంభంలో మోస్తరు వర్షాలు ఉండి, జూన్ 28



నుండి 30 మధ్య విస్తారంగా భారీ వర్షాలు కురిసే వీలుంది. రాయలసీమ ప్రాంతంలో ఆరంభంలో తక్కువగా ఉన్నప్పటికీ, వారం చివర్లో పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉంది. తెలంగాణలో నేడు (24న) ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం, నల్గొండ సహా ఎనిమిది జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయంటూ ఎల్లో అలర్ట్ జారీ చేశారు. వారం చివరి నాటికి హైదరాబాద్, రంగారెడ్డితో పాటు దక్షిణ జిల్లాలకు కూడా ఈ వర్షాలు విస్తరించనున్నాయి.

## సిగాచి పేలుడు బాధితులకు పూర్తి పరిహారం

# ఇవ్వాలి: బీ ఆర్ ఎస్ నేతల డిమాండ్

**ఇస్నాపూర్ మున్సిపాలిటీ:** సిగాచీ పరిశ్రమలో జరిగిన ఘోర పేలుడుఘటనకుఏడాదిపూర్తవుతున్నా బాధిత కుటుంబాలకు పూర్తి న్యాయం జరగలేదని బీఆర్ఎస్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. పటాన్చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ గడీల శ్రీకాంత్ గౌడ్, ఇస్నాపూర్ చైర్మన్ శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ ఘటనలో 54 మంది మృతి చెందారని, పలువురు గాయాలతో చికిత్స పొందుతూ మరణించారని తెలిపారు. మరో 8 మంది ఆచూకీ ఇంకా తెలియకపోవడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన రూ.కోటి పరిహారం హామీ ఇప్పటివరకు అమలు కాలేదని, కేవలం రూ.25 లక్షలు మాత్రమే అందాయని ఆరోపించారు. బాధిత కుటుంబాలకు మిగిలిన పరిహారాన్ని వెంటనే అందించాలని వారు డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. జూన్ 30న సిగాచీ పేలుడు బాధితులతో




కలిసి సంస్మరణ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభలో మృతిచెందిన కార్మికులకు నివాళులు అర్పించి, బాధిత కుటుంబాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. వారం రోజుల్లోగా పూర్తి పరిహారం చెల్లించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఇదే సమయంలో ధాన్యం కొనుగోళ్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులతో కలిసి పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ఇస్నాపూర్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## హార్మూజ్‌పై పట్టుకోసం ఇరాన్ బెట్టు

**అమెరికన్లను ఎప్పుడూ నమ్మబోమన్న ఇరాన్**

టెహ్రాన్: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గించేందుకు ప్రయత్నాలు జరుగుతోన్న తరుణంలోనూ.. హార్మూజ్ జలసంధిపై అమెరికా, ఇరాన్ తరచూ ఏదో ఒక ప్రకటన చేస్తూనే ఉన్నాయి. హార్మూజ్ నిర్వహణను ఇరానే చూస్తుందని ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ ఘాలిబఫ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ జలసంధి.. యుద్ధానికి ముందున్న స్థితికి ఎప్పటికీ తిరిగిరాదన్నారు. మేం అమెరికన్లను ఎన్నడూ నమ్మలేదు. ఇప్పుడూ నమ్మడం లేదు. భవిష్యత్తులోనూ వారిపట్ల ఆ ధోరణితో ఉండటం సమంజసమే అని ఘాలిబఫ్ అమెరికా పట్ల ఇరాన్‌కున్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. స్విట్జర్లాండ్‌లో ఇప్పటికే రెండు దేశాల మధ్య చర్చలు జరిగిన సంగతి తెలిసిందే. ఫ్రీజ్ చేసిన 12 బిలియన్ డాలర్ల ఇరాన్ ఆస్తులను విడుదల చేయడానికి తుది ఒప్పందం కుదిరిందని ఆయన పేర్కొన్నారు. కాగా.. తమ నుంచి సోయా, మొక్కజొన్న, గోధుమలు కొనేందుకు ఇరాన్ అంగీకరిస్తే.. ఫ్రీజ్ చేసిన ఆ దేశ ఆస్తులను విడుదల చేసేందుకు అమెరికా సిద్ధంగా ఉన్నట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హార్మూజ్‌పై భిన్నమైన వ్యాఖ్యలు చేశారు. హార్మూజ్ పూర్తిగా తెరిచే ఉందని ప్రకటించారు. ఈ జలసంధికి మరోవైపున ఉన్న ఒమన్ దేశం తాజా పరిణామాలపై స్పందించింది.

EDITED , PRINTED, PUBLISHED & OWNED BY PRINTED AND PUBLISHED BY MAHESH ETABONIA ON BEHALF OF NETI PRASTAVANAM MEDIA NETWORK , HNO- 14-249/1/37 SAI NAGAR COLONY,MEDCHAL(V) MEDCHAL MALIKAJGIRI, -501401 at 14-249/1/37 Sai Nagar Colony, MEDCHAI, TELANGANA STATE , EDITOR : MAHESH ETABONIA :9908086026 Website : https://netiprasthanam.in/